అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి

మల్లాపూర్: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ పటాన్‌బస్తీకి చెందిన పలువురు మహిళలు, డబుల్ బెడ్‌రూమ్‌కు దరఖాస్తు చేసుకున్నా ఇళ్లు రాని వారితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ సమయంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని చెప్పి, ప్రస్తుతం బీఆర్‌ఎస్ నేతలకు ఇళ్లు ఇవ్వడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జంజయ్ జైన్, జిల్లా ఎస్సీసెల్ సలహాదారులు పీజీ సుదర్శన్, నెమలి అనిల్, వంజరి సంతోష్, కప్పెర సాయిగౌడ్, రాజేష్, రిజ్వాన్, బాలరాజ్ గౌడ్, సాయిగౌడ్, దిలీప్‌గౌడ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి బరిలో నేనే

డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



అల్వాల్: మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేది తానేనని డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతాయని పార్టీ అభ్యర్థి మారే అవకాశం ఉందని వస్తున్న వార్తలు అవాస్తవమని, పార్టీ శ్రేణులు కంగారు పడొద్దని సూచించారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి పనిచేసిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని కాదని మరొకరికి అవకాశం కల్పించే పరిస్థితి ఉండదన్నారు. ఇప్పటికే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ నాయకులు పలు మార్లు అభ్యర్థుల ఎంపిక పట్ల స్పష్టం చేశారన్నారు. పార్టీ నాయకులను కాదని పార్టీ మారేవారికి ప్రాధాన్యం ఇవ్వదన్నారు.

11న క్రికెట్ పోటీలు

మల్కాజిగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మేడ్చల్-మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన అల్వాల్‌లోని సెయింట్ ఆల్ఫాన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు అండర్-14, 17 విభాగాల్లో జరుగుతాయని అధికారులు తెలిపారు. ఆసక్తి గల వారు మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఫోన్: 94418 12050.

అద్భుతాలన్నీ ఒకేచోట..

- ఎన్‌జీఆర్‌ఐలో ఓపెన్ డేలో సందడే సందడి
- వేల సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు
- ఎన్నో ప్రశ్నలకు శాస్త్రవేత్తల సమాధానాలు



అలియాబాద్ శ్రీసాయి స్కూల్స్ విద్యార్థులు



ఉప్పల్: ఎన్నో ప్రశ్నలు.. మరెన్నో సందేహాలు.. నిత్యం చూస్తున్న.. వింటున్న ఎన్నో అంశాలపై లోతుగా తెలుసుకుంటున్నప్పుడు చిన్నారుల ముఖాల్లో వెలుగులు.. భవిష్యత్‌లో ఎన్నో అద్భుతాలు సాధించే విద్యార్థులు శాస్త్రవేత్తలను కలిసి ఎన్నో విషయాలను తెలుసుకున్నారు. ఇందుకు వేదికైంది ఎన్‌జీఆర్‌ఐ (జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ). శుక్రవారం నిర్వహించిన ఓపెన్ డే విద్యార్థులకు మరిచిపోని అనుభూతి మిగిల్చింది. నిత్యం నాలుగు గోడల మధ్య తరగతి గదుల్లో చదువుకునే పాఠాలే వారికి తెలుసు. ప్రత్యక్షంగా సైంటిస్టులను ఇడిగి ఎన్నో విషయాలు తెలుసుకున్న వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు, సాధారణ పౌరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాళ్లు, రప్పలు, చెట్టు, మట్టి, పుట్ట, గుట్ట ఇలా ఒక్కటేమిటి.. ఏ ప్రశ్న అడిగినా శాస్త్రవేత్తలు వారికి వివరించారు. భూమి పుట్టుక, భూకంపాలు ఎలా సంభవిస్తాయి, ముందే ఎలా తెలుసుకుంటారు.. లక్షలు సంవత్సరాల రాళ్లను ఎలా గుర్తిస్తారు.. చెట్ల వయసు ఎలా తెలుస్తుంది.. ఇలా ఒక్కటేమిటి విద్యార్థుల ఎన్నో ప్రశ్నలకు జవాబు దొరికింది. ఎన్‌జీఆర్‌ఐలో ఎటు చూసినా విద్యార్థుల సందడే కనిపించింది. దాదాపు 7 వేల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాధారణ ప్రజలు పాల్గొన్నట్లు ఎన్‌జీఆర్‌ఐ సంస్థ ప్రతినిధులు తెలిపారు.





చిలుకానగర్ నుంచి బస్సు సౌకర్యం కల్పించాలి



ఉప్పల్: చిలుకానగర్ నుంచి సికింద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ శుక్రవారం ఉప్పల్ బస్సు డిపో మేనేజర్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతిరోజూ అనేక మంది విద్యార్థులు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సాధ్యమైనంత త్వరలో రూట్‌ను పరిశీలించి బస్సు సౌకార్యాన్ని కల్పించాల్సిందిగా కోరారు. అందుకు మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, రామాంజనేయులు, శ్రీనివాస్, సరిత, షైనాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 11వ డివిజన్ కార్పొరేటర్ కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్ అన్నారు. 11వ డివిజన్ పరిధిలోని హేమానగర్‌లో హరిత హారంలో భాగంగా శుక్రవారం ఆమె ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో పచ్చదనం పెరిగేలా మొక్కలు నాటి ప్రకృతిని ఆస్వాదించాలన్నారు. అంతేగాకుండా నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ వైస్ ఎంపీపీ కొత్త చక్రపాణిగౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు గడసు జగదీశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరి ముల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంతోష్‌రెడ్డి, శ్రీశైలం, కాలనీవాసులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య చక్రపాణిగౌడ్

యువతి వివాహానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన పేద యువతి రూప వివాహానికి బీఎల్‌ఆర్ ట్రస్టు ఆర్థిక చేయూత అందించింది. ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి శుక్రవారం ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే డివిజన్‌కు చెందిన మరో నిరుపేద కుటుంబానికి చెందిన అనురాధకు నిత్యావసర సరుకులను అందజేశారు. సామాజిక సేవా భావనతోనే పేదలకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు జంపాల్ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేదలకు బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు దూసరి నవీన్‌గౌడ్, పూస రమేష్, అమర్నాథ్‌రెడ్డి, మనీష్, ఫర్విన్, భాగ్యమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి

ఉప్పల్: హానికరమైన రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్టును తయారు చేస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. బీహార్ తాజపూర్ బాకా ప్రాంతానికి చెందిన మహ్మద్ అహ్మద్(24)రామంతాపూర్ కేసీఆర్ నగర్‌లో నివాసముంటూ 'న్యూ నేషనల్ జింజర్ గార్లిక్ పేస్ట్' పేరిట హానికరమైన మోనోహైడ్రేట్, గమ్, సిట్రిక్ యాసిడ్ తదితర రసాయనాల మిశ్రమంతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి నగరంలోని హోటళ్లు, షాపులకు సరఫరా చేస్తున్నాడు. ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం స్థావరంపై దాడి చేసి అహ్మద్‌ను విచారించగా మహ్మద్ జునైద్(34)తో కలిసి మిశ్రమాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపారు. భారీగా రసాయన పదార్థాలు, కల్తీ అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుమధురం తెలంగాణ మాండలికం

ప్రభుత్వ ప్రాచ్యా లిఖిత పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు

రామంతాపూర్: ప్రభుత్వ ప్రాచ్యా లిఖిత గ్రంథాలయం పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ తెలుగు భాషా దినోత్సవానికి రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తెలుగు అధ్యాపకులు విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రాచ్యా లిఖిత పరిశోధనాలయం డైరెక్టర్ పాలెపు సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు భాష మధురమైందని, అందులో తెలంగాణ మాండలికంతో కూడిన తెలుగు భాష మరింత సుమధుర భాష అన్నారు. ప్రాచ్యా లిఖిత పరిశోధనాలయం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ప్రచురించిన పలు పుస్తకాలు భావితరాలకు ఉపయోగపడేలా పరిశోధనలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తెలుగు విభాగాధిపతి కె.ప్రమీళ, తెలుగు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఉప్పల్: ఉప్పల్ గణేష్ నగర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉప్పల్ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉప్పల్ ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర కమిటీ అధ్యక్షుడు గిరి, మాధవరెడ్డి, చంద్రశేఖర్, కుమార్ హాజరయ్యారు.



11న గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై సమావేశం

మల్కాజిగిరి: వినాయకచవితి, గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని ఈ నెల 11వ తేదీ సోమవారం బృందావన్ గార్డెన్స్ ఆనంద్‌బాగ్‌లో ఉదయం 11 గంటలకు ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమావేశం జరుగుతుందని మల్కాజిగిరి సర్కిల్ డీసీ జి.రాజు తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబికా దేవి అమ్మవారికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేయగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియామకం



శ్రీనివాస్ ముదిరాజ్

గౌతంనగర్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గౌతంనగర్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి నియామక ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు.

చాంద్‌పాషా దర్గాకు సామాగ్రి



మల్లాపూర్: నాచారం చాంద్‌పాషా దర్గాకి మల్లాపూర్ యువదళ్ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ రూ.లక్ష విలువ చేసే ఐరన్ షెడ్ సామాగ్రిని శుక్రవారం దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. యువదళ్ సేవా కార్యక్రమంలో భాగంగానే అందజేసినట్లు ఆయన తెలిపారు. దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 11కేవి నాచారం వైజయంతి ఫీడర్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాబానగర్, రవీందర్‌నగర్, రాఘవేంద్రనగర్, దుర్గానగర్, కార్తికేయనగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.


జనహృదయనేతకు
జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ సిహెచ్. నరసింహారెడ్డి గారు
శ్రీ చామకూర మల్లారెడ్డి గారు
కార్మిక ఉపాధి కల్పన & శిక్షణ నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రివర్యులు
జనహృదయనేత, ప్రజలమనిషి,
రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో
కీలక పాత్ర పోషిస్తున్న
మన రాష్ట్ర ప్రియతమ మంత్రి వర్యులు
శ్రీ చామకూర
మల్లారెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ సిహెచ్. గోపాల్ రెడ్డి గారు
CHAIRMAN,
CMR GROUP OF INSTITUTIONS
శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు
మల్కాజ్‌గిరి పార్లమెంట్,
కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్